22 నుంచి శిల్పారామంలో దసరా సంబరాలు

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు అంటే మూడు రోజులపాటు దసరా సంబరాలు నిర్వహించనున్నట్లు పరిపాలనాధికారి సుధాకర్ వెల్లడిం చారు. స్థానిక శిల్పారామంలో దసరా సంబరాలు సంబంధించిన గోడ పత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం 5.45 గంటల నుండి రాత్రి 8.00గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయాన్నారు. కార్యక్రమ వివరాలు ఆయన వెల్లడించారు. 22న పులివెందుల శ బి. రాజా, శ్రీ రాజా కళా నిలయం, చిన్నరుల ఆధ్వర్యంలో శాస్త్రీయ మరియు జానపద నృత్యములు ప్రదర్శించ బడును. అలాగే 23న స్థానిక శ్రీ శర్వన్, యస్. కె. ఫిల్మ్ స్టూడియో వారి చిన్నరులచే సినీ, జానపద నృత్య ముల ప్రదర్శన అలాగే"మా ఊరి సినిమా" సక్సెస్ మీట్ జరుగును 24.న యువ కిషోర్, యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల చిన్నరులచే సినీ జానపద నృత్యములు ప్రదర్శించబడునని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ సదరు కార్యక్రమాలను విజయవంతం చేయాలని అయన కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలు సీజ్

విశాలాంధ్ర-సిద్దవటం: మండలంలోని మూల పల్లి వద్ద నుంచి మం గళవారం రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 4 టిప్పర్లు, 2 జేసీబీలు సీజ్ చేసినట్లు కడప డిఎస్పీ షరీఫ్ తెలిపారు. సిద్దవటం పోలీస్ స్టేషన్లో బుధవారం డిఎస్పీ మాట్లాడుతూ మండలంలోని మూలపల్లి వద్ద ఇసుక అక్రమ రవాణా జరుగు తుందని జేపీ కంపెనీ వారు ఎస్.ఈ.బి అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఎస్.ఈ.బి అధికారులు సిద్దవటం ఎస్సై కు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. స్థానిక పోలీసులు, ఎస్.ఈ.బి అధికారులు వెళ్లి 4 టిప్పర్లు, 2 జేసీబీలు సీజ్ చేసి నలుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారని మరో ఇద్దరు డ్రైవర్లు పరారయ్యారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ.బి సీఐ ఊరుక్కుందమ్మ, ఎస్.ఈ.బి ఎస్సై పురుషోత్తం బాబు, ఒంటిమిట్ట ఎస్సై మధుసూదన్ రావు, పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకం గా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేద, బడుగు బలహీను వర్గాల ప్రజలకు వరం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామం రెడ్డివారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం లో మనిషికి డబ్బు,ఆస్తులకంటే ఆరోగ్యం ఎంతో ముఖ్యం అన్నారు. ఆరోగ్యం సరిగా లేకపోతే అష్ట ఐశ్వర్యాలు ఉన్న ప్రయోజనం లేదన్నారు.ప్రజల చెంతకే వైద్య సదుపాయాలు తీసుకొచ్చామన్నారు.మెరుగైన వైద్యం అందించడమే కాకుం డా ఉచితంగా విలువైన మందులు అందజేశామన్నారు. కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించి అద్దాలు అవసరమైన వారికి మంజూరు చేశారు. వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి,వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, తహశీల్దార్ బి రామమోహన్, ఎంపిడిఓ జాషువా, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, వైసిపి నాయకులు తొండం రాజేంద్ర, సింగమాల రాజగోపాల్, తుమ్మల సురేష్,శ్రీకారం శివయ్య,మస్తాన్ రాయల్, మల్లు కృష్ణారెడ్డి,డివి రమణ, దామర్ల శిద్దయ్య, యువ నాయకుడు గణేష్, ఏఎన్ఎం లు,ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కుంకుమ అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర -రామసముద్రం: దసరా మహోత్సవాలు పురస్కరించుకొని మండలంలోని పలు అమ్మవారి ఆలయాలలో దసరా రెండవ రోజైన బుధవారం ప్రత్యేక పూజలు ,అభిషేకాలు చేశారు. మండలంలోని మాలేనత్తం పంచాయితీ మూగ ఎర్రపల్లె గ్రామంలో వెలసిన శ్రీ పటాలమ్మ అమ్మవారు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శివశంకర్ దీక్షితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చనలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కలు తీర్చుకున్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా
చమ్మర్తి నియామకంపై హర్షం

విశాలాంధ్ర - సుండుపల్లె : అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా చమర్తి జగన్మోహన్ రాజు టిడిపి అధిష్టానం నియమించడంపై పార్లమెంటు ఉపాధ్యక్షుడు భగవాన్ సాహయ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రాజును సన్మానించారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తప్పులు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చిట్టెం రామచంద్ర, రెడ్డన్న, అశోక్ నాయుడు పాల్గొన్నారు.

గాయత్రి మాతగా రెడ్డెమ్మ తల్లి

విశాలాంధ్ర -గుర్రంకొండ :మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రెడ్డమ్మ దేవత దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు శ్రీ అమ్మవారు శ్రీ గాయత్రీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో శ్రీ అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సామూహిక కుంకుమార్చన నిర్వహించడమైనది. ఈవూరి శేఖర్ బుధవారం ఉభయ దారులుగా వ్యవహరించారు. రేపు మూడవ రోజు శ్రీ అమ్మ వారు శ్రీఅన్నపూర్ణదేవిగా దర్శనమిస్తారని ఆలయ ఈఓ మంజుల తెలియజేశారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన బృంగి సాత్విక్

విశాలాంధ్ర -కడప : రోలర్ స్కేటింగ్ పోటీల్లో కడపకు చెందిన బృంగి సాత్విక్ బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్టు హ్యాపీ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ తెలిపారు. కడప డీఎస్సీ స్కేటింగ్ అకాడమీలో నిర్వహించిన 5-7 సంవత్సరాల విభాగంలో సాత్విక్ బంగారు పథకం సాధించి నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తల్లిదండ్రులు అందరూ కూడా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులకు ఎంతో ప్రయోజన కరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్తో పాటు జిల్లా స్కేటింగ్ కోచ్ క్యారీ, సాత్విక్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెండి కిరీటాలు అపహరణ

విశాలాంధ్ర- సుండుపల్లి : మండలంలోని మాచిరెడ్డిగారి పల్లి పంచాయతీ చిన్న బిడికి లో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో మంగళ వారం రాత్రి దొంగతనం జరిగినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గర్భగుడి గేటును బ్రేక్ చేసి గుడి లోపల స్వామి వారికి అలంకరించిన సుమారు 10 కేజీల వెండి కిరిటాలు అపహరించి తీసుకెళ్లినట్లు తెలియజేశారు. దొంగలించి తీసుకెళ్తుండగా సీసీ కెమెరాలలో రికార్డ్ అయినట్లు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని రూరల్ సిఐ,వేలిముద్రల సేకరణ అధికారులు పరిశీలించి వేలిముద్రలను సేకరించినట్లు తెలిపారు. 10 కేజీల వెండి బంగారం విలువ సుమారు 7లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

కేంద్రం వద్ద జగన్ ప్రాణాలు

ఎన్నికల్లో దేశం విజయాన్ని ఎవ్వరు ఆపలేరు: టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రాణాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రయోజనాలపై జగన్ నోరు తెరిస్తే, ఈడీ కేసుల్లో లోనికి వెళ్తారని టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ద్వారకా నగర్ లో శ్రీనివాసరెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ లో అవినీతి జరిగిందని, అక్రమ కేసుతో చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో ఉంచారే తప్ప, ఒక్క రూపాయి కి ఆధారాలు చూపలేకపోయారని చెప్పారు. యువత శిక్షణకు రూ, 370 కోట్లు ఖర్చయింది, శిక్షణ పొందిన యువత బయో డేటాలు ఇవ్వడం జరిగిందన్నారు. సిఐడి అధికారులు జగన్ కాళ్ళ కింద నలిగిపోతున్నారని అన్నారు. 2020లో కృష్ణా జలాలు ఇరు రాష్ట్రాలకు సరిసగం అని కెసిఆర్ అంటే, జగన్ నోరు మెదపక వచ్చారని ఆయన గుర్తు చేశారు. 2017 లో కేంద్రం బ్రిసేన్ ట్రిబ్యునల్ పునర్ పరిశీ లించాలని చెబితే చంద్రబాబు అడ్డుకున్నారని అన్నారు. కృష్ణ జలాల పున: పంపిణీ పై కేంద్ర ప్రభుత్వం గజిట్ విడుదల చేసిందని దీనిపై జగన్ నోరు మెదపలేదన్నారు. 24 లక్షల హెక్టార్లు కృష్ణా ప్రాంతాలు పంట వేసుకునే పరిస్థితి ఉందన్నారు. చీముకు ఇచ్చిన 512 టీఎంసీల నీటి వాటాను తగ్గించాలని చూస్తున్నారన్నారు. ఇదే జరిగితే పులివెందుల రైతులే జగన్ చొక్కా పట్టుకుని నిలబెడతారని ఆయన హెచ్చరించారు. దేశం హయాంలో వ్యవసాయానికి 63 కోట్లు ఖర్చు చేసిందని, ఈ ప్రభుత్వం నీటి పారుదల శాఖను మూసేసిందని ధ్వియబెట్టారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ ని తెచ్చి ఓడిపోయిందని, జనతా పార్టీ ఇందిరా గాంధీని ఒక్కరోజు జైల్లో ఉంచినందుకు జనతా పార్టీ ఓటమిపాలైందని, చంద్రబాబును జైల్లో పెట్టిన వైకాపా పాలనకు అదే గతి తప్పదన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని వైకాపార్ రౌడీలు, పోలీసులు, వాలంటరీలు ఆపలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కృష్ణా జలాలపై రాజీలేని పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబును జైల్లో ఉంచి, జగన్ తాడేపల్లి ప్యాలెస్ లో పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. జగన్ నిరంకుశ పాలనతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు,పెట్టుబడిదారులు రాక యువత ఉద్యోగ, ఉపాధి లేక తీవ్ర నిరాశతో ఉన్నారని చెప్పారు. వైకాపా అధికారం కోల్పోయిన తరువాత ఆ పార్టీ నాయకుల పరిస్థితి ఏంటో అన్నారు. ఆ పార్టీ ఖాళీ కావడం ఖాయమని ఆయన హెచ్చరించారు. కడప నియోజకవర్గ టిడిపి ఎన్టీఆర్ రెడ్డప్ప గారి మాధవి మాట్లాడుతూ వైయస్సార్ కాలనీలో వీధులకు సిసి రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు కాలేదు అన్నారు. టిడిపి హయాంలో మంజూరైన ఎన్టీఆర్ గృహాలకు ,జగనన్న గృహాలుగా పలకలు మార్చడం జరిగిందన్నారు. ఇటువంటి దొంకతిరుగుడు విధానాలకు పాల్పడడం, సిగ్గుచేటు అని ఆమె అన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్, వంశీ రెడ్డి, ఏటూరి లోకేష్ తోపాటు పలువురు టిడిపిలోకి సోమిరెడ్డి సమక్షంలో చేరగా, కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-లింగాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద కుడాలలో బుధవారం ఇంటింటా ఫీవర్ సర్వేలార్వా సర్వే నిర్వహించి మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహనా కల్పించారు.ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ మంచినీటి నిల్వలలో పెరిగే అనాఫిలిస్ దోమ మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తాయన్నారు.. ఇంటి పరిసరాల్లోని చిన్న చిన్న నీటి నిల్వలలో పెరిగే ఏడిస్ దోమ డెంగీ చికెన్ గున్యా వ్యాధిని వ్యాప్తి చేస్తాయని తెలిపారు.. మురికి నీటి నిల్వలలో పెరిగే క్యూలెక్స్ దోమ బోదవ్యాధి. మెదడువాపు వ్యాధిని వ్యాప్తి చేస్తాయి. దోమల వ్యాప్తిని అరికట్టుటకు తీసుకోవలసిన చర్యలు :మీ ఇంటి మురికి కాలువలో చెత్త చెదారం వేయకూడదన్నారు.. నీటిని వారానికి ఒకసారి నీరు మార్చి నింపుకున్నట్లయితే దోమల బెడద వుండదన్నారు పూలకుండీలలో, ఇంటి పైకప్పుపై నీరు నిలువ లేకుండా చూడాలన్నారు.సెప్టిక్ ట్యాంకు గ్యాస్ పైపులకు జాలీలు అమర్చాలని.. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించి అన్ని నీటి నిల్వలను, పాత్రలను శుభ్రపరిచి తిరిగి నీరు నింపుకోవలన్నారు.. ఈ కార్యక్రమములో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్. నాగేశ్వరి, చంద్ర కళావతి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు భవిష్యత్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు ఉజ్వల భవిష్యత్తు అని ఎంఆర్ పిఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు వెంబడి రాధాకృష్ణ పేర్కొన్నారు.బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అధ్వర్యంలో కొన్నేళ్లుగా ఉద్యమాలను కొనసాగిస్తున్నామన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు వినతిపత్రాలు కూడ అందజేశామన్నారు.అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు తీవ్ర అన్యాయం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.హామీలు ఇచ్చిన పార్టీలన్ని మాదిగలను నిలువునా మోసం చేశాయని విమర్శనాస్త్రాలు సంధించారు. వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తున్నామన్నారు. అయినా రాజకీయ పార్టీలలో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు.మా లక్ష్యం నెరవేరే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మాదిగల విశ్వరూప మహాసభ పేరుతో పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. అక్రమ కేసులకు బయపడం ఉద్యమాలను కొనసాగిస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే సంబరాలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : స్థానిక కేఓఆర్ ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీ రింగ్‌లో మొదటి సంవత్సరం డిప్లమా, ఇంజనీరింగ్ మరియు ఎంబీఏ విద్యార్థిని విద్యార్థులను ఆహ్వానిస్తూ ఘనం గా ఫ్రెషర్స్ డే సంబరాలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగంగా సమాజానికి దోహదపడే అంశాలపై షార్ట్ ఫిలిం మరియు స్కిట్‌బీ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా వివిధ ప్రోగ్రామ్స్‌ని ఫ్లాష్ మాబ్ అనగా డాన్స్ ప్రోగ్రామ్స్‌లలో విద్యార్థిని విద్యార్థులు చాలా ఉత్సాహముతో పాల్గొనడం జరిగింది. ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించి కాలేజీ సెక్రెటరీ మరియు కరస్పాం డెంట్ శ్రీమతి లికిత రెడ్డి సభను ఉద్దేశిస్తూ ఈ పోటీ ప్రపంచంలో తాము ఉన్నత శిఖరాలను అందుకోవ డానికి సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు టెక్నికల్ స్కిల్ వంటి అంశాలపై పట్టు సాధించాలని వీటికి సంబంధించి కాలేజీ అన్ని సౌకర్యాలు అందించడం జరుగు తుందని తెలిపారు. ప్రిన్సిపల్ లావణ్య విభాగ అధిపతులు సభను ఉద్దేశించి తమ సందేశాలను విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తెలిపారు.

పోరుమామిళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : మేజర్ పంచాయతీ కార్యాలయంలోని ఒకటవ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిభిరానికి 448 మంది రోగులు వచ్చి పేర్లు నమోదు చేసుకొని వివిధ రకాల జబ్బులకు సంభందించి, పరీక్షలు, చికిత్సలు చేయించుకోవడం జరిగింది. వైద్యం చేయించుకున్న వారికి మందులు కూడా ఉచితంగా ఇవ్వడం జరిగింది. మధ్యాహ్నం రోగులకు, సిబ్బందికి భోజన వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. పోరుమామిళ్ల మండల ప్రత్యేక అధికారి చంద్ర శేఖర్, ఎంపిడివో వర ప్రసాద్ నూతన పోరుమామిళ్ల మేజర్ పంచాయితీ ఇంచార్జి కార్యదర్శి వెంకట సుబ్బయ్య, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, డాక్టర్లు, ఏఎన్ఎంలు, చామంతి, వాలంటీర్లు, వైద్య సిబ్బంది, పంచాయితీ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో త్రీడీ ప్రింటింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర -మదనపల్లె: ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ నందు మెకానికల్ ఇంజనీరింగ్వి విభాగము ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఆఫ్ 3డి ప్రింటింగ్, సి.యెన్.సి మేచినింగ్ రోబిటిక్స్ ఫర్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ పై వర్క్ షాప్ ను విద్యార్థులకు నిర్వహించినారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో 3%ఐ% ప్రింటింగ్ కు డిమాండ్ పెరగనుంది అని, ఈమేరకు దానికి సంబంధించిన అప్లికేషన్స్ కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది అని అన్నారు. ముఖ్యంగా ఆసుపత్రు ల్లో మానవ అవయవాల ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం త్రీడీ ప్రింటింగ్ అవసరం కావచ్చు అని, ప్రస్తుతం దీని పై టెక్నాలజీ అభివృద్ధి చెందుతూ ఉంటుంది అని అన్నారు. అంతే కాకుండా కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ మెషిన్ ల వాడకం రోజు రోజు కు ఎక్కువ అవుతున్నదని అన్నారు. కార్యక్రమం లో విభాగాధిపతి డాక్టర్ భాస్కరన్, కన్వీనర్లు జగన్నాథ్ పట్టార్, రాఘవేంద్ర రాఘవేంద్ర, కో కన్వీనర్ నగేష్ అధ్యాపకులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

47వ సారి రక్తదానం

విశాలాంధ్ర -సుండుపల్లె : హైదరాబాద్ నగరం నందు ఒక పేషెంట్ కు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స కొరకు అత్యవసరంగా రక్తకణాలు అవసరం కాగా ప్రముఖ సంఘ సేవకుడు డా.సయ్యద్ అహ్మద్ స్వయంగా గచ్చిబౌలి ఎఐజి బ్లడ్ బ్యాంకు వెళ్లి రక్త కణాలు దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ ప్రతి మూడు నెలలు ఓసారి ఖచ్చితంగా రక్తదానం, ప్రతి 15 రోజులకొకసారి రక్త కణాల దానం చేస్తానని, దాని మూలంగా ఆరోగ్యం బాగా మెరుగ్గా ఉంటుందని, రక్తంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ సమంగా ఉంటాయని పేర్కొన్నారు.

రామనామంతోనే మనిషి మనుగడ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరు దైవనామ స్మరణ చేసుకోవాలని అందుకు మన ఆరాధ్యదైవమైన ఒంటిమిట్ట కోదండరాముని రామనామ సంకీర్తన చేసుకోవాలని మండల వైసీపీ మండలాధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులు రెడ్డి అన్నారు. గురువారం ఒంటిమిట్ట రామాలయం నందు కోదండరామ స్వామి రామ సంకీర్తన జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ రామనామ సంకీర్తనకు జిల్లా నలుమూలల నుంచి 5వేల మంది భక్తాదులు హాజరై రామనామ సంకీర్తన 24 గంటలు నిరంతరాయంగా చేసుకుంటూ భక్తులకు ఆనందం కలిగిస్తారన్నారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఈ రామాలయనికి ఎనలేని కృషి చేశారని అన్నదాన కార్యక్రమానికి రూ.3కోట్లు మేడా రామకృష్ణారెడ్డి పేరు మీద అందజేశారని గజ్జల శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మేడా మల్లికార్జునరెడ్డి నిరంతర భక్తుడని పేదలన్నా భక్తులన్నా ఎంతో అభిమానమని ఈయన జీవితం ప్రజలకే అంకితమని ఇలాంటి ఎమ్మెల్యే మనం ఎన్నడూ తెచ్చుకోలేమని రాబోవు ఎన్నికలలో రాజంపేట ఎమ్మెల్యేగా తిరిగి మేడా మల్లికార్జునరెడ్డిని గెలిపించుకోవాలని ఆయన రాజంపేట నియోజకవర్గ ప్రజలకు, భక్తులకు విన్నవించారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుస్తక పఠనంతో దసరా సెలవులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : విద్యార్థులు దసరా సెలవులలో గ్రంధాలయానికి వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞాన వంతులు కావాలని విశ్రాంత డిప్యూటీ డి. ఎం. హెచ్. ఓ డాక్టర్ మార్క రెడ్డి జె వి వి జిల్లా కార్య వర్గ సభ్యులు ఖాసీమ్ వల్లి సూచించారు. బుధవారం స్థానిక గ్రంధాలయములో విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పుస్తక పఠనం తో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రానిస్తారన్నారు. ఈ సందర్భంగా జె వి వి జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాసీమ్ వల్లి విద్యార్థులకు ఆంగ్ల భాషలో గ్రామర్‌పై శిక్షణ నిచ్చారు.విద్యార్థులు ఆంగ్లములో మాట్లాడటం సాధన చేయాలని సూచించారు.సెలవులలో విద్యార్థులు గ్రంధాలయ నికి వచ్చి అందుబాటులోని పుస్తకాలను చదవాలని గ్రంధాలయ అధికారి ఆఫ్రిది విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర పతి అవార్డు గ్రహీత దాదాపీర్, ఉపాధ్యాయులు పీర్ బాషా పాఠకులు ఖదీర్ బాషా, ఖాజావలి, మునవర్, యస్విత, అయిమన్, లాస్య తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: తులసిరెడ్డి



విశాలాంధ్ర-వేంపల్లె: రానున్న ఎన్నికల్లో పులివెం దుల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా మని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. వేంపల్లె కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం పులివెందుల నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనరు నజీర్అహ్మద్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో రానున్న ఎన్నికలల్లో అనుసరించాల్సిన పద్ధతులు, వ్యూహ ప్రతివ్యూహాలు తదితర అంశాలపై ఆయన సమన్వయ కమిటీ సభ్యులకు దశాదిశ నిర్దేశించారు. 2024 ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనియేయాలని కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. ప్రత్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించడమే మన ధ్యేయమని వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దేశంలోనూ రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. అసమర్ధ విధానాల వల్ల కేంద్రం లో రాష్ట్రంలో అనిశ్చితి నెలకొందన్నారు. రాష్ట్రం ఆర్థికసంక్షోభంలోకి వెళ్లిందన్నారు. నవరత్నాలు గులకరాళ్లుగా, ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీగా రాష్ట్ర రుణాంధ్రప్రదేశ్‌గా, మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. మేనిఫెస్టోలోని అన్ని అంశాలను నెరవేర్చామని వైసీపీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నా ఆచరణలో అతీగతిలేదన్నారు. అన్నిటి కంటే ముఖ్యంగా విభజన అంశాలు ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ప్రత్యేకహోదా ముగిసిన అధ్యాయమన్నారు. పోలవరం నిర్మాణంపై కేంద్రం చేతులెత్తిందన్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక జాడలేదన్నారు. కడప ఉక్కు పరిశ్రమ గురించి ఊసేలేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావన కూడా లేదన్నారు. రాష్ట్రం విడిపోయి సుమారు దరిదాపు 9ఏళ్లు కావస్తున్నా ఇంత వరకు విభజన అంశాలు ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేరకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. కాగా రానున్న ఎన్నికల్లో తాము ఆరుసూత్రాల అమలు కార్యక్రమంతో ముందుకు వెళతామన్నారు. ఈ ఆరుసూత్రాలు ప్రజలకు ఆమోగ్యంగా ఉన్నాయని, ఇందుకు ప్రజల నుంచి కూడా విశేష స్పందన కూడా లభిస్తోందన్నారు. ఇక ప్రత్యేకహోదా తాము అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేకహోదాపై తొలిసంతకం చేస్తానని తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అనేక సందర్భాలలో హామీనిచ్చిన విషయాన్ని తులసిరెడ్డి గుర్తుచేశారు. ఇలాంటి స్థితిలో తమకు గెలుపు సునాయంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ముమ్మాటికి పులివెందుల గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడుందన్నారు. ఆ మేరకు ప్రజలు కూడా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీనీకాయల కొనుగోలులో కమీషన్‌ను నివారించాలి: బిటెక్ రవి

విశాలాంధ్ర- పులివెందుల: చీనీ కాయల కొనుగోలు విషయంలో కమీషన్ పద్ధతిని నివారించాలని టీడీపీ పులివెం దుల అసెంబ్లీ ఇన్‌చార్జి బిటెక్ రవి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో చీనీ కాయల క్రయ, విక్రయాలను బుధవారం ఆయన పరిశీలించి, కొనుగోలు విషయమై అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నుండి అధికారులు 8శాతం కమీషన్ తీసుకొని చీని పంటను కొనుగోలు చేసుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు 20 కేజిలు తరుగు తీసుకుంటున్న విషయం కూడా తాను తెలుసుకున్నానన్నారు. ఆ తరుగు కూడా లేకుండా రైతుల దగ్గర కొను గోలు చేస్తే రైతులకు మరింత న్యాయం చేసినట్టు అవుతుందని అధికా రులకు వివరించారు. 7 మండలాలల్లో బత్తాయి పంట 40 వేల ఎకరాలాల్లో రైతులు సాగు చేస్తున్నారని వారికి సరైనటు గిట్టుబాటు ధర రావాలంటే ఇక్కడ కొందరు మాత్రమే వ్యాపారస్తులు ఉన్నారన్నారు. బయట నుండి కూడా వీడియో కాల్‌లో చూసి ఆన్లైన్ లో ఫంక్షనింగ్ జరిగితే రైతులకు మరింత మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. మార్కెట్ యార్డులో రోజుకు వంద టన్నులు చీనీకాయలు వస్తున్నాయని, ఇంకా ఎక్కువ టన్నులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంకా మరింత ఈ విధానాన్ని అభివృద్ధికి శ్రీకారం చుడుతామని రైతులకు వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీలో 100 మంది చేరిక

విశాలాంధ్ర- మదనపల్లె: మదనపల్లి బాబు కాలనీ లో బుధవారం వందమంది స్థానిక వాసులు కాంగ్రెస్ పార్టీ చేరారు. నియోజకవర్గ ఇన్చార్జ్ రెడ్డి భాషా జిల్లా పార్టీ అధ్యక్షులు అల్లా బక్షు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇండియా కూటమి అజెండాతో పేద బడుగు బలహీన మైనార్టీలకు మంచి జరుగుతుందని ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చిన్న కృష్ణ జిల్లా ఆర్టిఐ అధ్యక్షులు అమీర్ సోషల్ మీడియా చైర్మెన్ నరేష్ వైవి రమణ మీనా కుమారి చలపతి ఎస్ కే భాష మహమ్మద్ పీర్ మొహమ్మద్ షఫీ మొహమ్మద్ అలీ వెంకటరమణ సుధాకర్ పాల్గొన్నారు

చిరస్మరనీయుడు కందుల శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కీ.శే.కందుల ఓబుల్ రెడ్డి (ఎం.పీ) గారి తనయుడు కీ.శే. కందుల శ్రీనివాస రెడ్డి 44 వ వర్ధంతి వేడుకలు కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నేడు 18 అక్టోబర్ 2023 (బుదవారం) ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ శ్రీ కందుల రాజ మోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ నేడు 44 వ వర్ధంతి సందర్భంగా,43 సంవత్సరాలు సుదీర్ఘ ప్రయాణంలో, కళాశాల అభ్యున్నతికి కీలక పాత్ర వహించిన నా అన్న కీ.శే.కందుల శివానంద రెడ్డి గారు కృషి చేశారని తెలియజేశారు.అనంతరం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) మాట్లాడుతూ తమ కళాశాలలో వేల మంది పేద ఇంజనీరింగ్ విద్యార్థులు విద్యను అభ్యసించి నేడు దేశ, విదేశాలలో అత్యున్నత హోదాలలో స్థిర పడడం సంస్థకు ఎంతో గర్వ కారణం అని, తెలియ జేస్తూ మా బాబయి 1979 వ సంవత్సరంలో డిల్లీ లో బీ టెక్ మెకానికల్ ఇంజనీరింగ్ అభ్యసిస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం మా కుటుంబానికి తీరని లోటని,ఆనాడు మా తాత గారు కీ.శే.కందుల ఓబుల్ రెడ్డి వారు లేని లోటు కారణంగా వారి పేరు మీద కళాశాలను 1980 వ సంవత్సరంలో స్థాపించడం జరిగిందని,గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెసరరీ సెక్రెటరీ కందుల రాజేశ్వరమ్మ, పద్మావతమ్మ, శకుంతలమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) గారు, ప్రధానాచార్యులు డాక్టర్ శ్రీ వి ఎస్ ఎస్ మూర్తి గారు, ప్రముఖ పారిశ్రామిక వేత్త రాజోలు వీరా రెడ్డి, కే ఓ అర్ ఏం ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ కళాశాల లిఖితా రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ పీ.ప్రేమ కుమార్, వివిధ విభాగాల అధిపతుల,బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బిరెడ్డిస్వామి దసరా ఉత్సవాలు జయప్రదం చేయండి
ఆలయ ధర్మకర్త పోతిరెడ్డి రెడ్డయ్య

విశాలాంధ్ర- అట్లూరు : అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద నిర్మించిన శ్రీశ్రీశ్రీ అవధూత అబ్బిరెడ్డి స్వామి దసరా ఉత్సవాలు ఈ నెల 20వ తేదీ శుక్రవారం నుండి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త పోతిరెడ్డి రెడ్డయ్య, సతీమణి మాజీ మండల ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, రిటైర్డు వీఆర్ఓ అబ్బిరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం అబ్బిరెడ్డి స్వామి ఆలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు కుడుములదిన్నె ఈశ్వర్‌రెడ్డిచే భజన కార్యక్రమం, 21వ తేదీ శనివారం ఉదయం గణపతిపూజ, 22న ఆదివారం రామచంద్రచే భజన కార్యక్రమం, 23న సోమవారం ఉదయం ప్రాత:కాలపూజ, అభిషేకం, చండీపారాయణం, చండీహోమం, మహాపూర్ణాహుతి, మహామంగళ హారతి, కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు 24వ తేదీ మంగళవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం రాత్రికి భజన కార్యక్రమాలు అట్లూరు క్రాస్‌రోడ్డులోని సోమశిల ముంపు గ్రామాలైన పురవీధుల్లో ఎల్లమ్మతల్లి అబ్బిరెడ్డి స్వామి ఆలయం నుంచి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అబ్బిరెడ్డిస్వామి ఆలయం విద్యుత్ దీపాలంకరణతో జిగేల్ మనే లైటింగ్‌తో చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దున్నూతల విష్ణువర్ధన్‌రెడ్డి, దున్నూతల ప్రతాప్‌రెడ్డి, మారారెడ్డి ఆలయ పూజారి పవన్, పోతిరెడ్డి నరసింహ పాల్గొన్నారు.

శ్రీకృష్ణమూర్తి అవతారములో దర్శనమిచ్చిన అమ్మవారు



విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట పట్టణంలోని అమ్మవారి శాలలో శ్రీ మత్కన్యకా పరమేశ్వరి దేవి శరన్న రాత్ర మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు బుధవారం శ్రీ కృష్ణమూర్తి అవతారము లో భక్తులకు అమ్మ వారు దర్శనమిచ్చారు. రాజంపేట పట్టణంలోని రెడ్డివారి వీధిలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు భక్తులకు ధనలక్ష్మి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఉదయం అమ్మవార్లకు ఆలయ అర్చకులు గణపతి హోమం శ్రీ వాసవి మూలమంత్ర నిత్య హోమం, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి చుట్టూ ప్రదర్శనలు చేశారు. వచ్చిన భక్తులకు సంఘం నాయకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా

కౌన్సిలర్ ఆన్ డ్యూటీలో కౌన్సిలర్ ఇర్ఫాన్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తన వార్డులోని సమస్యలు పరిష్కరించేందుకు కౌన్సిలర్ ఆన్ డ్యూటి కార్యక్రమం చేపట్టినట్లు 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాష తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపాల్టీ పరిధిలోని మెయిన్ వాటర్ ట్యాంకు మరమ్మత్తులు జరుగుతున్నందున 13వ వార్డు ప్రజలకు మంచి నీళ్ల సమస్య ఉందని తన దృష్టికి వచ్చిన వెంటనే పనులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా త్వరితగతిన పనిని పూర్తి చేయాలని సిబ్బందికి కోరారు. ఈ పని పూర్తి అయ్యేంతవరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా తన సొంత ఖర్చుతో ప్రైవేటు మినరల్ వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు మినరల్ వాటర్ అందించారు. వాటర్ సమస్యను తక్షణమే స్పందించి మినరల్ వాటర్ అందించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ ఇర్ఫాన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

చెత్త సేకరణ వాహనాలకు డీజల్ కొరత

ప్రతి నెలా రూ.వేలల్లో డీజల్ ఖర్చులు- దుబారా అరికడితే ప్రయోజనం-ఎమ్మెల్యే దృష్టి సారిస్తే ఫలితం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన ఎర్రగుంట్ల పురపాలిక పరిస్థితి పేరుగొప్ప-ఊరుదిబ్బలా తయరైందని చెప్పడానికి చెత్త సేకరణ వాహనాలకు డీజల్ కొరతే తార్కాణమని చెప్పవచ్చు. బుధవారం ఉదయం సంబందిత పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించే పనికి విరామం ఇచ్చారు. విషయమేమిటని ఆరా తీయగా..చెత్తసేకరణ, చెత్త తరలించే వాహనాలకు డీజల్ పట్టించకపోవడంతో తాము ఖాళీగా ఉన్నామని సదరు కార్మికులు పేర్కొనడం గమనార్హం. డీజల్ విషయంపై తాము సంబందిత అధికారులను ప్రశ్నించగా మీ వద్ద ఉన్న డబ్బులతో డీజల్ పట్టుకోండంటూ సమాధానం చెప్పినట్లు సదరు కార్మికుల ద్వారా తెలుస్తోంది. అనంతరం ఎలాగోలా డంపర్ లారీకి డీజల్ సమకూర్చుకొని కార్మికులు సదరు వాహనాన్ని రోడ్డుపైకి తేవడం జరిగింది. ఈ వాహనం ద్వారా కేవలం పట్టణంలో రెండు మూడు చోట్ల ఉన్న డంపర్ బిన్‌ల వద్ద నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తరలించి అనంతరం డీజల్ లేక కార్యాలయం వద్ద నిలపడం గమనార్హం. మరో రెండు మూడు రోజులు డీజల్ ఇబ్బందులు తప్పవని సాక్షాత్తు పురపాలిక ఉన్నతాధికారులే చెప్పినట్లు సమాచారం. సాధారణంగా పురపాలిక ఖజానా నుండి డీజల్ బిల్లుల పేరిట ప్రతి నెలా రూ.70వేల నుండి రూ.90వేల వరకు ఖర్చు కనిపిస్తుంది. అయితే అప్పుడప్పుడు డీజల్ కొరతతో వాహనాలను పక్కన పెడుతుండడం కూడా మనం గమనించవచ్చు. 2012లో పురపాలికగా మారిన ఎర్రగుంట్ల నగర పంచాయతీలో చెత్త సేకరణ రవాణాకు సంబందించిన వాహనాలను సమర్థవంతంగా నిర్వహించుకోలేకపోవడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. ఇంత జరుగు తున్నా లోపానికి కారణమైన అంశాలను పరిశోధించి సరిదిద్దే అధికారులు కానీ పాలక వర్గం కానీ కనిపించకపోవడం దురదృష్టకరం. పట్టణంలో చెత్తసేకరణ, చెత్తను తరలించేందుకు మూడు ఆటోలు, రెండు ట్రాక్టర్లు, డంపర్ లారీ ఒకటి ఉన్నాయి. ఈ కొన్ని వాహనాలకు సైతం డీజల్ పట్టలేని దుస్థితిలో ఎర్రగుంట్ల పురపాలిక ఉండడం పట్టణ ప్రజలు చేసుకున్న కర్మ కాబోలు. పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు గత 5 రోజులుగా చెత్త సేకరణ వాహనాలు వెళ్లకపోవడం ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది.

ఎమ్మెల్యే దృష్టి సారిస్తే ఫలితం: స్థానిక పురపాలికపై పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే డా.సుధీర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం ద్వార ఇక్కడి లోపాలను సరిదిద్దాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉన్న నిధులను సక్రమంగా వినియోగించడం ద్వారా దుబారా ఖర్చులను అరికట్టి ప్రజలకు అవసరమైన ఓ మేరకు మౌలిక వసతులు కల్పించాలని వారు గుర్తుచేస్తున్నారు. అలాకాకుండా ప్రేక్షకపాత్ర పోషిస్తే ఇతర మార్గాల్లో నిధులు తరలివెళ్లే ప్రమాదం ఉంటుందని వారు సూచిస్తున్నారు.

హిజ్రాల బలవంతపు వసూళ్ళను ఆపాలి

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణంలో హిజ్రాలు బలవంతపు వసూళ్లను ఆపాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ దసరా పేరిట వారు ప్రతిరోజు వివిధ దుకాణాల వద్దకు వెళ్లి డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారన్నారు. ఒక్కో షాపు నుంచి వివిధ రకాల మొత్తంలో వసూలు చేస్తున్నారు. పెద్ద షాపు అయితే 10000 రూపాయలు మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారని వారు వెల్లడించారు. లేదంటే షాపు వద్ద వివిధ రకాల శబ్దాలు చేస్తూ షాపులకు వచ్చిన వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నట్లు వ్యాపారులు వ్యాఖ్యానిస్తున్నారు. దసరా పూర్తయ్యే వరకు ఈ దందా కొనసాగుతుం దని, ఇలాంటి పరిస్థితుల్లో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హిజ్రాల వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట వేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

మాజీ సర్పంచు కృష్ణయ్యకు నివాళి

విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట మండలం వరిగడ్డిపల్లి మాజీ సర్పంచు కృష్ణయ్యకు పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి నివాళులు అర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణయ్య కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న తులసిరెడ్డి కడపకు వెళ్లి అక్కడ కృష్ణయ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. కృష్ణయ్యకు నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథరెడ్డి, నామా వినయ్, బాలం సుబ్బరాయుడు, ఉత్తన్న, రామకృష్ణ ఉన్నారు.

ఉద్యోగస్తుల ఓట్లకు మోడీ బిస్కట్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఐదు రాష్ట్రాల్లో జరగబోయే, మరియు 2024లో రాబోయే లోక్‌సభ ఎన్నికల భయంతోనే ఉద్యోగస్తులకు డి.ఏలు పెంచడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ కార్మిక భాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ తొమ్మిది ఏళ్ల పరిపాలనలో కనపడని ఉద్యోగస్తులు ఎలక్షన్లు దగ్గర పడేసరికి కనబడ్డారా అని ప్రశ్నించారు. మోడీ 9 ఏళ్ల పరిపాలనలో ఉద్యోగస్తు లకు ఒరిగిందేమీ లేదన్నారు. కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్ అసలే లేదని విమర్శించారు. మీరు ఎన్ని మోసపూరిత మాటలు చెప్పినా, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మరు, మోడీ చరిష్మాకు చమరగీతం పాడే రోజులు దగ్గరకు వచ్చాయని అన్నారు. ఐదు రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికలలో బిజెపికి ఘోర ఓటమి తప్పదని, 2024 సార్వత్రిక ఎన్నికల లో ఇండియా కూటమి విజయకేతనం ఎగరవేస్తుందని పేర్కొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన

విశాలాంధ్ర - వల్లూరు : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వారి సౌజ న్యంతో గ్రామీణ ప్రజలకు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు బ్యాంకు మేనేజర్ నాగముని నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రం లోని కుమారుని పల్లి గ్రామంలో యం.వి రూలర్ కళాజాతర బృందం వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు నందు బ్యాంకులో ఉండేటు వంటి స్కీమ్స్, లోన్స్ గురించి ప్రధానమంత్రి సామాజిక భద్రతా పథకాల గురిం చి ఇన్సూరెన్స్‌ల గురించి పొదుపు సంఘాల గురించి గ్రామ ప్రజలకు అర్థమయ్యే రీతిలో కళాకారులు మ్యాజిక్ షో ద్వారా పాటల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కుమార్, సిబ్బంది రవికుమార్ కళాజాత బృందం మహేష్ ,వినోద్ పాల్గొన్నారు.

ఇల్లూరు సురక్షలో ఎమ్మెల్యే సుధీర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డా.సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. వైద్య శిబిరం మండల తాహసీల్దార్ నాగేశ్వర రావు పర్యవేక్షణలో కొనసాగింది. ప్రత్యేక వైద్యులు రాంసాగర్‌రెడ్డి, సుధతో పాటు స్థానిక డాక్టర్లు నాగార్జున, పద్మావతి పాల్గొని వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రంతుల్లయ్య, మండల పరిషత్ కార్యాలయ ఏఓ త్రిమూర్తి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విష్ణు, గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో విజిలెన్స్ వారోత్సవాలు

విశాలాంధ్ర -కడప కలెక్టరేట్ : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించినట్టు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ (ఎస్డి పిఎస్) చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంబంధిత హక్కులు మరియు ప్రజా వేగుల రక్షణ తీర్మానం 2004 గురించి సుదీర్ఘంగా వివరించారు. అనంతరం వారోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మరియు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ సివిల్ విభాగాధిపతి శ్రీ చందన, పవర్ గ్రిడ్ సివిల్ ఇంజనీర్ రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

రావణాసుర వధ కథా వైభవమే దసరా

విశాలాంధ్ర-పులివెందుల: రావణాసుర వద కథా వైభవమే దసరా అని చెబుతారు. ఏడాదికి ఒక మారు జరుపుకునే దసరా పండుగకు ఘన చరిత్ర ఉంది. 10 రోజులపాటు నిర్వహించే దసరా ప్రాచీన కాలం నుంచి ప్రాచుర్యం పొందింది. జాతీయ స్థాయిలో జరుపుకునే దసరా ఉత్సవాలకు సంబంధించి విద్యాశాఖ పాఠశాలకు సెలవులు కూడా ప్రకటిస్తుంది. ఇంతటి ఘన చరిత్ర ఉన్న దసరా గురించి సమాచారం ఇలా ఉంది. హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో దసరా ఒకటి. ఈ దసరా పండుగ ఎంతో ప్రాచుర్యం పొందినట్లు పురాణాలు వెల్లడిస్తున్నాయి. ఆశ్వీజం మాసంలో ఈ దసరా పండుగను పది రోజుల పాటు నిర్వహిస్తారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగ అని పెద్దలు చెబుతున్నారు.ఈ దసరా పండుగనే విజయదశమి అని కూడా పిలుస్తారు. దసరా పండుగ రోజుల్లో రావణ వధ. జమ్మి చెట్టుకు పూజలు చేయడం ఆచారంగా వస్తోంది. దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి విజయాన్ని పొందిన సందర్భముగా పదవరోజు ప్రజలంతా సంతోషముగా పండుగ జరుపుకోవడం దసరా ఉత్సవాల విశిష్టతకు అద్దం పడుతోంది. ఈ దసరా ఉత్సవాలలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఆదివారం ప్రారంభమైన ఈ దసరా ఉత్సవాలు ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయాల కమిటీ నిర్వాహకులు ఈ సందర్భంగా వెల్లడించారు. భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకుని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు.

వైసిపి ఆగడాలను అంతమొందిద్దాం



విశాలాంధ్ర - చెన్నూరు : రాష్ట్రంలో వైసిపి ఆడాలను అంతమొందిద్దామని మండల టిడిపి అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డిలు మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కుంచెం రామ కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. బాబుతో నేను అనే కార్యక్రమం చెన్నూరులోని బెస్త కాలనీ నందు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గ ఇన్చార్జి పుత్తా నరసింహా రెడ్డి ఆదేశాల మేరకు ఇల్లు ఇల్లు తిరిగి ప్రతి వ్యక్తితో మమెకమై మరి ముఖ్యంగా కాలనీలో ఉండేటువంటి మహిళ మనతో కలిసి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును, జగన్మోహన్ రెడ్డి అరాచకాలను వివరించుతూ ప్రజలతో మేము సైతం బాబు కోసం అనేటువంటి నినాదంతో చెన్నూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు కొండపేట సుధాకర్ రెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బెస్త సాధికార కమిటీ కార్యవర్గ సభ్యుడు మల్లె సుబ్బయ్య, టిడిపిబిసి సీనియర్ నాయకులు దగ్గర రమేష్, జింకా నిత్య పూజయ్య, మామిళ్ళ వెంకట కృష్ణయ్య, బీసీ సీనియర్ నాయకులు దగ్గర బాల గురయ్య, శ్రీపతి శ్రీనివాసులు పాల్గొన్నారు.

యాదవ సమాజ అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని యాదవ సమాజ అన్నదాన సత్రం అభివృద్ధికి కమిటి సభ్యులు అందరు కృషి చేయాలని అధ్యక్షుడు పెరుగుకృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజు, కోశాధికారి మేకల పెద్దన్నయాదవ్‌లు పేర్కొన్నారు. బుధవారం నూతన కార్యవర్గం ఏర్పడిన సంధర్భంగా రాబోయే రోజుల్లో జరిగే కార్యాచరణ ప్రణాళికపై సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈ సంధర్భంగా అధ్యక్షులు పెరుగుకృష్ణ యాదవ్ మాట్లాడుతూ మన యాదవ సమాజ అన్నదాన సత్రం అభివృద్ధికి నిరంతరం కృషి చేసి అభివృద్ధి బాటలో నడుపుకోవాలని సమావేశం నందు కమిటి సభ్యులకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో సంఘం అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాన శ్రీనివాసులు, చాగనబోయిన సుబ్బరాయుడు, కృష్ణలక్ష్మయ్య, విష్ణు నారాయణ, సిద్దయ్య, ఓబయ్య, ముద్దం సుబ్బరాయుడు, ఓబయ్య కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఒకటో వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-జమ్మలమడుగు : మున్సి పాలిటీ పరిధిలోని 1వ వార్డులో బాబుతో నేను, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిం చిన జమ్మలమడుగు తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఈ సందర్భంగా స్థానిక దస్తగిరి స్వామి దర్గాలో ప్రత్యేక పూజలు చేసి 151 టెంకాయలు కొట్టి చంద్రబాబు గారు ఆయురారోగ్యాలతో త్వరగా బయటకు రావాలని ప్రార్థన చేశారు. అనంతరం వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు గారి అక్రమ అరెస్టు గురించి వివరించారు.ఈ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను, ఈ ప్రభుత్వంలో పెరిగిన నిత్యావసర ధరలు వాటి ప్రభావం సామాన్యులపై ఏ విధంగా ఉందో తెలియజేశారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు గ్యారంటీ పేరుతో ప్రజలకు తెలుగుదేశం పార్టీ ద్వారా చేసే మేలును తెలిపే కరపత్రం పంపిణీ చేస్తూ వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జి. లక్ష్మీనరసింహారెడ్డి, బాల పుల్లారెడ్డి, అన్వర్ భాష, నజీర్, దస్తగిరి, గౌస్ మోదిన్, జికె గైబు, పేక్షావలి, మురళి, మునేసులు, సంజీవ, ఐఎల్ చిన్న, నవీన్ రాయల్, జాకీర్, శ్రీనివాసుల్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతి రత్నాలు- శారదా నిలయం విద్యార్థులు

విశాలాంధ్ర-పులివెందుల: శారదా నిలయం పాఠశాల విద్యార్థులు జాతి రత్నాలని ఆ పాఠశాల వ్యవస్థాపకులు బయపు రెడ్డి కొనియాడారు. పులివెందుల పట్టణంలో 1981-90 బ్యాచ్ కి చెందిన పూర్వపు విద్యార్థు లు బుధవారం సమావేశమయ్యారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బయపురెడ్డి, సతీమణి టీచర్ ఆల్ఫోన్సమ్మతో కలిసి ఫ్రెండ్ షిప్ కేక్ కట్ చేసి విద్యార్థులకు అందించారు. అనంతరం ఉపాధ్యాయుల స్ఫూర్తి ప్రదాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి గురుపూజోత్సవం నిర్వహించారు. తదనంతరం పూర్వ విద్యార్థులు అల్ఫోన్సమ్మ బయపురెడ్డి దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందించారు. తమ ప్రథమ గురువుకు పాదాభివందనం చేసి, ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కరీంనగర్ నుండి విచ్చేసిన పూర్వ విద్యార్థి అబుల్ కలాం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మిమిక్రీ అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి , పూర్వ విద్యార్థులు పాత్రికేయులు చంద్రమోహన్ రెడ్డి , అబుల్ కలాం, శస్త్ర సురేంద్ర, వీరప్రకాష్ , మధు, మహేష్, రాము, రవి, త్రివేణి ,ముని, సుజ్ఞాన్ , అంజి , ఉల్లి మెల్ల జగదీష్, నరేంద్ర, ప్రవీణ్, జనార్ధన్ , భాస్కర్ ,సురేష్, త్రివేణి , షేక్షా, షాహిదా, సాయి లక్ష్మి, పాల్గొన్నారు.

మృత్యుంజయ కుంటలో దసరా సంబరాలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 11వ డివిజన్ మృత్యుంజయ కుంటలో ఏర్పాటుచేసిన అమ్మవారిని దర్శించుకునేందుకు బుధవారం కడప నగర మేయర్ సురేష్ బాబును ఆహ్వానించామని 11వ డివిజన్ ఇంచార్జ్ భాస్కర్ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా డివిజన్లో తొలిసారిగా దసరా ఉత్సవాలు అమ్మవారి ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి పూజా కార్యక్రమానికి మా నాయకులు మేయర్ సురేష్ బాబును ఆహ్వానించామని ఆయన ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నందుకు మాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ నవరాత్రులు జరుపుకుంటారని ఈ సదవకాశాన్ని మా డివిజన్ ప్రజలతో పాటు కడప నగర ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 10 వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున 13 వ డివిజన్ కార్పొరేటర్ రామలక్ష్మణ రెడ్డి ఆంజనేయులు శివ బాబు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి:ఏఎస్పీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పట్టణ ప్రజలకు దొంగతనాల నివారణ కోసం ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉచితంగా ఏర్పాటుచేశామని ఏఎస్పీ ప్రేరణకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా సెలవుల్లో ప్రజలు దొంగతనాల నుండి అప్రమత్తంగా ఉండాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు ఉపయోగించు కోవాలన్నారు. ప్రజలు తమ మొబైల్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల న్నారు. దసరా సెలవుల్లో భాగంగా ఇతర ప్రదేశాలకు వెల్లేవారు ప్రొద్దుటూరు రూరల్ కమాండ్ కంట్రోల్ నెంబర్ 91211 00702కు గాని లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి ఈ సేవలను పొందవచ్చని అన్నారు. వీలైతే మీ యొక్క విలువైన వస్తువులు, ఆభరణాలు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా దసర పండుగ నవరాత్రులు సంధర్భంగా ఇండ్లకు తాళం వేసి దర్శనానికి ఆలయాల వద్దకు లేదా ఎగ్జిబిషన్ లేదా ఇతర అవసరాలకు ఇల్లు వదిలి బయటకు వెళ్లేటప్పుడు దొంగతనాల నివారణ కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు ఒరిగిందేమీ లేదు



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత నాలుగున్నర సంవత్సర కాలంగా ఎస్సీ ఎస్టీలకు చేసింది ఏమీ లేదని విడుదలై చిరుతల కచ్చి (వి.సి.కె.) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.టి.ఎం. శివప్రసాద్ ఆరోపించారు. ఏమిటి ఈ అన్యాయము అని అడిగిన వారిని అక్రమ కేసులు బనాయించడం, దాడులు చేయించడం పనిగా పెట్టుకున్నదని ధ్వజమెత్తారు. దీంతో ఇటు అణగారిన వర్గాలైన యస్సీ, యస్టీ, బీ.సీ. మైనార్టీ కులాలపై పేట్రేగుతున్నదంత ఇటు పాలనులు, ఆయా రౌడీమూకలు అణగారిన వర్గాలైన యస్సీ, యసీ, బీ.సీ. మైనార్టీ కులాలపై పేట్రేగుతున్న తీరు దారుణ మన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా అణగారిన వర్గాలలో చైతన్యం తీసుకురావాలనే ధ్యేయంతో బుధవారం కడప ప్రెస్ క్లబ్ నందు వి.సి.కె. పార్టీ రాయలసీమ ప్రతినిధుల సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా శివప్రసాద్ హాజరై మాట్లాడారు. పేరుకో అవి కార్పోరేషన్లని అందులో చిల్లి గవ్వ కూడా లేకుండా చేసి దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ వర్గాల ప్రజలను దగా చేశారన్నారు. పైపెచ్చు జగన్రెడ్డి పాలనలో ప్రజా సమస్యలను కూడా చెప్పుకోలేని దుస్థితిలో ఇవాళ ప్రజలున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పాలనకోసమా వైసీపీని గెలిపించిందని ప్రజలు సిగ్గుపడుతున్నా రన్నారు. కావున రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలకు (175 ఎంఎల్ఎ 25 ఎం.పి) స్థానాలకు తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ప్రజలు మా పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల పార్టీ ఇన్చార్జ్ బాలసింగం, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, గాయని భూదేవి, జిల్లా అధ్యక్షులు కిరణ్, గణపతి, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

తప్పుడు కేసులు నిలబడవు.. ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగు దేశం పార్టీ జాతీయ నాయకులు నారా చంద్ర బాబు నాయుడు పై పెట్టిన తప్పుడు కేసులు నిలబడవని, న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని తొందరలోనే చంద్రబాబు నాయుడు ప్రజాక్షేత్రంలోకి వస్తారని నారా భువనేశ్వరి తెలిపారని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి కృష్ణ తెలిపారు. బుధవారం రాజమండ్రిలోని లోకేష్ క్యాంప్ కార్యాలయంలో నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ రాజకీయ కోణంలోనే జరిగిందని, స్కిల్ డెవలప్మెంట్ లో ఎటువంటి స్కామ్ జరగలేదని, చంద్రబాబు నాయుడుకి స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి సంబంధం లేదని ప్రజలందరూ అనుకుంటున్నారని తెలిపారు. ఈ అరెస్టుతో పోలీసు వ్యవస్థ పైన ప్రజలకు నమ్మకం పోయిందని భువనేశ్వరికి తెలియజేశారని తెలిపారు. ఈ రాక్షస పాలన అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఓటు అనే ఆయుధంతో ప్రజలందరూ బుద్ధి చెబుతారని తెలిపారు. కక్షపూరిత రాజకీయాలు మాని ప్రజలకు కావలసిన అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు అందించాలని కోరారు. లేకపోతే రాబోయే రోజుల్లో వైసిపి పార్టీ కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు.

సేవాతత్పరుడు మంజునాథరెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: మా ఊరి సిని నిర్మాత మంజునాథరెడ్డ సేవా తత్పరుడని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ రెడ్డి కొనియాడారు. మాఊరి సినిమా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం మ్యాట్నీషోలో చిత్ర నిర్మాత మంజు నాథరెడ్డి , హీరోమహేష్ ఇతర చిత్రనటీనటులతో కలిసి పట్టణంలోని సుజాత థియేటర్లో ప్రేక్షకుల సమక్షంలో 20 మంది దివ్యాంగులకు లగేజ్ బ్యాగులను వితరణంగా అందించారు. అదేవిధంగా నిరుపేద నేపాలి బాలికకు చదువుకునేందుకు 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. లింగాల మండలం దొండ్లవాగు గ్రామంలో జన్మించిన మంజునాథరెడ్డి అంచెలంచెలుగా ఎదిగి సినీనిర్మాతగా మారడంతో పాటు, రాయలసీమ యాస, భాషతో కూడిన మన సం స్కృతి ,సాంప్రదాయాలను ప్రతిబింపజేసే ఉత్తమ చిత్రాన్ని నిర్మించడం తోపాటు, ఈ చిత్రం ద్వారా ఎంతోమంది నూతన నటీనటులను, అందులోనూ ముఖ్యంగా ప్రతిభఉన్న పులివెందుల కళామతల్లి బిడ్డలను సినీ పరిశ్రమకు పరిచయం చేసిన మహోన్నత వ్యక్తిగా మంజునాథరెడ్డి అలియాస్ బుల్ రెడ్డిని అభివర్ణించారు. కార్యక్రమంలో సినిమా హీరో మహేష్, వికలాంగుల నెట్వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, నటీనటులు రైతు బిడ్డ హరి, రాఘవేంద్ర రెడ్డి, శివారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, పఠాన్ పాల్గొన్నారు.

అంజద్ బాషను విమర్శించే స్థాయి మాధవిరెడ్డికి లేదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మా నాయకులు అంకితభావంతో పనిచేసే ప్రజల మెప్పు పొందినటువంటి అంజాద్ భాషను విమర్శించే స్థాయి మాధవి రెడ్డికి లేదని వైయస్సార్ సిపి జోనల్ ఇంచార్జ్ ఎం కె రత్నకుమారి అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మాధవి రెడ్డి నీ స్థాయి మా నాయకుడిని విమర్శించడం సరికా దన్నారు. మీరు మీ నియోజకవర్గంలో ఏమైనా ఉంటే మాట్లాడాలి కానీ మీరు స్థానికేతరులు అని మర్చిపోతున్నారన్నారు. ముందు మీరు వార్డు మెంబర్ గాను, కౌన్సిలర్ గాను, కార్పొరేటర్ గాను గెలిచి చూపించండన్నారు. ఏ ఎన్నికల్లో మీరు పోటీ చేశారు ఎక్కడ గెలిచారు. ఏ ఒక్క చోట కూడా మీరు గెలవలేదు. అటువంటి మీరు మా నాయకుడు అంజాద్ భాషను మాట్లాడడం సరికాదన్నారు. ఓట్లు అడుక్కునే పద్ధతి కూడా నీకు తెలియదు కానీ ఎదుటివారిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. మా నాయకుడు గడపగడపలో తిరుగుతుంటే ప్రజలు ఆయనను మెచ్చుకునే విధానాన్ని చూసి తర్వాత మాట్లాడాలని మండిపడ్డారు. ఇప్పటికైనా మా నాయకులు ఎటువంటి వారు తెలుసుకొని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

మాజీ మంత్రి డీఎల్‌ను ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: బ్రహ్మంగారి మఠం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 15వ తేది నుండి 25వ తేది వరకు శరన్నవరాత్రి మహోత్సవాలకు బి.మఠం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి, ఉపాధ్య క్షులు అయ్యపుసురేష్‌బాబు, సుంకు చిన్న సిద్దయ్య, దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందచేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకా వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు యాదాళ్ల వెంకటసుబ్బయ్య, కమిటీసభ్యులు దుగ్గిశెట్టి గురువయ్య, సుధాకర్, గాధంశెట్టి బాలనరసింహులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఘనంగా వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే



విశాలాంధ్ర -కడప : ఫ్రెషర్స్ డే 2023. గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ సెమినార్ హాల్ నందు. ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సురేఖ ముఖ్య అధ్యక్షతన. 20 20 మ్యాచ్ విద్యార్థులు ఘనంగా నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ ఏ సురేఖ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు. ఈ ఆరు సంవత్సరాలు కాలాన్ని. కళాశాలలోని వసతుల్ని. సక్రమంగా వినియోగించుకుంటూ. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి., వైస్ ప్రిన్సిపల్. డాక్టర్ వరలక్ష్మి. డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ రెడ్డి. వైద్య విద్యార్థుల్ని అభినందిస్తూ. కళాశాలలోకి ఆహ్వానించారు. వివిధ విభాగాల విభాగాధిపతులు. విద్యార్థులకు తెల్లకోటు వేసి. వైద్య విజ్ఞాన ప్రపంచంలోనికి ఆహ్వానించారు.

లంకమల అభయారణ్యంలో అటవీశాఖ అధికారుల కూంబింగ్



విశాలాంధ్ర-సిద్దవటం: సిద్దవటం రేంజ్ పరిధిలోని లంకమల అభయారణ్యంలో స్క్వాడ్ రేంజర్ నయీం అలీతో కలిసి బుధవారం కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో సిద్దవటం, మద్దూరు, గొల్లపల్లి, కొండూరు, రోళ్ళబోడు ప్రదేశాల్లో కూంబింగ్ చేశామన్నారు. అటవీ ప్రాంతంలో ఎలాంటి కదలికలు లేవని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, కడప స్క్వాడ్ సెక్షన్ అధికారి నాగరాజు, బీట్ అధికారి, రాజశేఖర్ రెడ్డి, హైమవతి పాల్గొన్నారు.

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా



టీడీపీ నేత చమ్మర్తి జగన్మోహన్ రాజుకు నియామకం పై హర్షం

విశాలాంధ్ర-పీలేరు:- టీడీపీ నేత చమ్మర్తి జగన్మోహన్ రాజు నియామకం పై పీలేరు మండల మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మోదిన్ భాషా (బుజ్జి)హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతు రాజంపేట పార్లమెంట్ టిడిపి నూతన అధ్యక్షుడుగా నియమితులైన చమ్మర్తి జగన్మోహన్ రాజు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని,అలాగే టీడీపీ లో కార్యకర్తలకు ఎప్పటికి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు.

సుగవాసి ప్రసాద్ బాబుని కలిసిన జగన్ రాజు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: బుధవారం సాయంత్రం గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు సుగవాసి ప్రసాద్ బాబుని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం జగన్ మోహన్ రాజుకి సుగవాసి ప్రసాద్ బాబు బొకే అందజేసి శాలువ కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా రాయచోటి టిడిపి పార్టీ స్థితిగతులపై వారిరువురూ చర్చించుకోవడం జరిగినది. అదేవిధంగా సీనియర్ టిడిపి నాయకులు మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడును కూడా జగన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి రాయవరం వేములయ్య, సుగవాసి శ్రీనివాసులు, లాయర్ సతీష్ రెడ్డి, మన్నేరు రామాంజనేయులు, మన్నూరు రాజశేఖర్,స్టూడియో ప్రసాద్, కిషోర్ చౌదరి, బండకింద మనోహర్, మాజీ కౌన్సిలర్ సహదేవా, టి ఎన్ ఎస్ ఎఫ్ రాజంపేట ఉపాధ్యక్షుడు కటారు శివ, బడిశెట్టి రవి, శరత్ గౌడ్, కోటి, సైఫుల్లా, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్లో ఉన్న ఆటో డ్రైవర్ల పోలీస్ ఈ చలనాలు రద్దు చేయాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర -రాజంపేట: రాష్ట్ర వ్యాపితంగా ఆటో కార్మికులకు పెండింగ్లో ఉన్న పోలీసు ఈ-చలానాలు రద్దు చేసి, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం రాజంపేట ఆర్డీవో కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరుతూ చేపడతామన్న ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత ఉద్యమాలపై ఉక్కు పాదం మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో అండ్ మోటార్ వాహన డ్రైవర్లకు పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని భారీగా పెనాల్టీలు పెంచే జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని ఆటో మోటార్ వాహనాల పై ఉన్న పెండింగ్ లో ఉన్న పోలీస్ ఈ చలనాలు రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పేరుతో సంవత్సరానికి 10 వేల రూపాయలు ఇస్తూ మరో వైపు ఇన్సూరెన్స్, ఎఫ్. సి. పోలీసు ఈ చలానాలు పేరుతో ట్యాక్స్ పేరుతో ఆటో డ్రైవర్ల నుంచి విపరీతంగా ధరలు పెంచి దోపిడీ చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు.ఆటో నడుపుతున్న ప్రతి ఆటో డ్రైవర్ కు వాహనమిత్ర పథకం వర్తించే విధంగా చూడాలని, ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈనెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో ఆటో వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి పట్టణ కార్యదర్శి సికిందర్, సిపిఐ ఏరియా సెక్రెటరీ శివరామకృష్ణదేవరా, ఆటో వర్కర్స్ యూనియన్. నాగేశ్వర, బ్రహ్మయ్య, చంద్ర, ఆనంద్, మౌలా, రమణ, హర్షద్, సుబ్బు, అస్లాం, రాజా, నాగేంద్ర, బాలు, సుబ్రహ్మణ్యం, చలపతి, భాస్కర, హరి, ప్రసాద్, నరేష్, శిరీష్, హరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల చెంతకే వైద్య సేవలు

గాలివీడు గ్రామ సచివాలయం3 లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

విశాలాంధ్ర-గాలివీడు: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎంజగన్ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని మండల వైసీపీ అధ్యక్షులు యదుభూషన్ రెడ్డి తెలిపారు.బుధవారం గాలివీడు-3 సచివాలయం పరిధిలో లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గడప వద్దకే వైద్యంను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఐదు అంచెల్లో జరిగే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, పిల్లలు, యువత.. ఇలా ప్రతి ఒక్కరి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించి వాటిని కచ్చితంగా పరిష్కరించేలా జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.గ్రామాలలో జరిగే సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్లెలు, కాలనీల్లోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాలకు స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి వైద్యం చేయడం రాష్ట్రంలో మునుపెన్నడూ చూడలేదన్నారు.ప్రజలకు ఇంటి వద్దే బీపీ, షుగర్, హెచ్బీ, డెంగీ, మలేరియా సహా ఏడు రకాల పరీక్షలు అవసరం మేరకు నిర్వహించి ఫలితాలను యాప్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 3,255 వ్యాధులకు ఉచిత వైద్యం అందుతోందని,చికిత్స/ శస్త్ర చికిత్సల తదనంతరం రోగి విశ్రాంతి తీసుకునే సమయంలో దినసరి భత్యం కు వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా ద్వారా రూ 225 ను అందిస్తోందన్నారు. నాడునేడు కింద అన్ని ప్రభుత్వ ఆస్పత్రులనుఅభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు.నాలుగేళ్ల పాలనలో కేవలం వైద్యానికి రూ.3,600 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు.వైద్య ఆరోగ్య శాఖలో 50 వేల పోస్టులను నియమించిన ఘనత సీఎం జగన్ కు దక్కుతుందన్నారు.ప్రతి ఆరునెలలకొకసారి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు.సర్పంచ్ లక్ష్మిదేవమ్మ గారు మాట్లాడుతూ ఆరోగ్య సేవలను ప్రజల చెంతకే ప్రభుత్వం చేరుస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.మన సీఎం జగన్ ప్రజలను తన కుటుంభ సభ్యుల వలే బాధ్యతగా చూసుకుంటుండడం అభినందనీయ మన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవమ్మ ఎంపిడిఓ జాబిర్ అహ్మద్, పంచాయతీ సెక్రటరీ,మండల జేసీఎస్ కన్వీనర్ షేక్ ఖాదర్ మొదిన్ వైస్ ఎంపీపీ2 శ్రీనివాసులు , మాజీ ఎంపిటిసి కృష్ణ, వార్డ్ మెంబర్ వెంకటయ్య, నాగభూషణ్ నాయుడు,చక్రపాణి, ఆదినారాయణ రెడ్డి,సుబ్బారెడ్డి, సభాపతి నాయుడు, శ్రీనివాస నాయుడు,వీరాంజనేయులు నాయుడు, పలువురు గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎఎన్ఎంలు,ఆశా వర్క ర్లు, సచివాలయం సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గ్రామ వాలింటైర్లు తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మి దేవిగా దర్గా మాతాజీ

విశాలాంధ్ర- రామాపురం : చరణ్ నవరాత్రి శ్రీ సద్గురు దర్గా మాతాజీ ఉత్సవా మండలంలోని నీలకంఠ రావు పేట సమీపంలో ఉన్న శ్రీ దర్భా సాయి నగర్ లో కొలువైన శ్రీ సద్గురు దర్గా మాతాజి గజలక్ష్మి దేవి గా అలంకారంలోను. నీలకంఠరావుపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శ్రీ గజలక్ష్మి దేవి అలంకారముతో బుధవారం భక్తులకు దర్శనమిచ్చింది. బెంగళూరుకు చెందిన వేద పండితులచే ఉదయం నుండి మహా గణపతి పూజలు. గంగపూజ .నవగ్రహాల పూజ. కలశస్థాపన .అభిషేక పూజలు. జపాలు. హెూమాలు .తీర్థ ప్రసాదాలు .మహా మంగళహారతి భక్తులకు అందించారు. రాత్రికి శ్రీ చక్ర పూజ కుంకుమార్చనలు చేశారు. పలు ప్రాంతాల నుండి దర్బార్ సాయి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో

విశాలాంధ్ర -రామాపురం : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి., ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హైదర్ వల్లి అన్నారు. మండలం లోని నీలకంఠరావుపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేద ప్రజల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి మన్ననలు పొందాడని ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేత కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్ కుమార్. సర్పంచ్ పటాన్అయుబ్ ఖాన్. జిల్లా ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్. ఇలియాజ్ .ఇంతియాజ్. సిరాజ్. ఫిరోజ్. అలీ ఖాన్. వెంకటసుబ్బారెడ్డి .సహదేవరెడ్డి. రామ సుబ్బారెడ్డి. పురుషోత్తం రెడ్డి. రఫీ .జమీల్. బాబు . ఆజాద్ ఖాన్. షేక్ ఇషాక్ బాషా .సచివాలయ సిబ్బంది. వై జె సిబ్బంది అంగన్వాడి సూపర్వైజర్. అంగన్వాడి కార్యకర్తలు ప్రజలు. మహిళలు పాల్గొన్నారు.

యం. యం.కన్స్ట్రక్షన్స్ పేరిట కార్ల భారీ స్కాం

అతి పెద్ద స్కాంతో కార్ల మాయ - విలువైన కార్లన్నీ కోట్లల్లో కుదువ

బాధితులంతా బడా,బడా నాయకులు, వైసీపీ, టీడీపీకి చెందిన వారే -కార్ల భాగోతాన్ని బయటపెట్టిన ఓ కారు డ్రైవర్

పోలీసులకే అంతుచిక్కని మిస్టరీ - ప్రధాన సూత్రధారుడు ఓ విశ్రాంత ఉద్యోగి కుమారుడే

పీలేరు, కలికిరి, గుఱ్ఱంకొండ పోలీస్ స్టేషన్ లను ఆశ్రయించిన బాధితులు

విశాలాంధ్ర-పీలేరు: సమాజంలో భూకబ్జాలు ఆక్రమణలు దందాలు చూశాము తొలిసారిగా నిందితుడు సరికొత్త టెక్నాలజీతో నకిలీ ఎం ఎం కన్స్ట్రక్షన్స్ పేరిట బడా, బడా నాయకులు,వైసీపీ టీడీపీ నాయకులకు చెందిన కార్లను ఎంచుకొని వారి, వారి విలువైన కార్లను ఎటువంటి భయంలేకుండా కుదవ పెట్టడం, కోట్లలో డబ్బులు తీసుకోవడం ఆపై జల్సాలు చేయడం పరిపాటి అయింది.అతి పెద్ద స్కాంతో వారి కార్లన్నీ కుదవ వ్యాపారానికి అప్పగించడంతో చివరకు ఓ కారు డ్రైవర్ ఈ భాగోతాన్ని పసిగట్టి తాను కూడా బాధితుడు ఉండడంతో అమూల్యమైన సమాచారాన్ని సేకరించి మిగతా వారికి తెలియజేయడంతో తమ కార్లన్నీ అతిపెద్ద స్కాం లో ఇరుక్కున్నాయని పరుగులు పెట్టారు. అసలు పోలీసులకే అంతుచిక్కని ఈ మిస్టరీలో కోట్లాది రూపాయల విలువ గల కార్లు ప్రైవేటు సంస్థలు, ఉద్యోగులు కుదవ పెట్టుకున్న వైనం వర్ణనతీర్థం. వీటి అన్నీటికి ప్రధాన సూత్రధారుడు పీలేరులోని ఓ కీలకమైన శాఖలో నాలుగో తరగతి ఉద్యోగిగా పని చేస్తూ రిటర్మెంట్ అయిన ఆ ఉద్యోగి కుమారుడే ఇందుకు మూల కారణం.అతని ముందర సాఫ్ట్వేర్లు, ఇంజనీర్లు, విద్యావేత్తలు, మేధావులు చివరకు ఓట్ల కోసం హామీలు ఇచ్చే రాజకీయ నాయకుల వాళ్లు గాని చెయ్యలేని సాహసోపేతమైనటువంటి నిర్ణయం తీసుకొని ఎవ్వరికి అనుమానం రాకుండా వారి కార్లకు అగ్రిమెంట్లు చేయడం, కుదవ పెట్టడం ఎప్పటినుంచో జరుగుతూ ఉండేది. ఈ నేపథ్యంలో ఇటీవల పీలేరు కు చెందిన ఓ కారు డ్రైవర్ రోడ్డు పనుల నిమిత్తం నాలుగు చక్రాల వాహనాలు కావలెనని ఈ నోట, ఆ నోట వినడంతో వారి అడ్రస్ ను కనుక్కొని తన కారును కూడా లిజ్ అగ్రిమెంట్ చేసి ఇచ్చాడు. అంతేకాదు అగ్రిమెంట్లో కారుకు సంబంధించిన పక్కా పత్రాలు, ఆధార్ కార్డు, ఆర్ సి నెంబరు, కారు నెంబరు, నివాస గృహ అడ్రస్సు అన్ని జతచేసి కడప జిల్లా సంబేపల్లి కి చెందిన ఇంకొక్కనితో మదనపల్లెలో ఒక రూమును అద్దెకు తీసుకొని అక్కడ అగ్రిమెంట్ చేయించుకుని మాసానికి 40 వేల రూపాయలు తమ అకౌంట్ లోకి చెలిస్తామని ఈరోజు నుంచి లీజు అగ్రిమెంట్ ప్రకారం వాహనాన్ని తమకు అప్పగించాలని అగ్రిమెంట్కు ఇరువురు అంగీకారముతో ఒప్పందానికి కుదుర్చుకొని ఆ అగ్రిమెంట్ లోప్రధాన నిందితుడి సంతకం, అగ్రిమెంట్ చేసిన సంతకం చేసి వాహనాన్ని వారికి అప్పజెప్తారు. తక్షణమే నిందితుడు వాహనానికి సంభందించిన పత్రాలు ఉండడంతో, తన సొంత కారు గా ఓ నకిలీ పత్రాన్ని సృష్టించి సరైన ఆధారాలు చూపించి కుదువ పెట్టుకున్న వారికీ నమ్మబలికి వారికీ ఎటువంటి అనుమానం రాకుండా అగ్రిమెంట్ చేసి వాహన%శీ% విలువను బట్టి 3నుండి 5 ఆపైన లక్షలలో నగదు తీసుకోవడమే కాకుండా 5 నుంచి 10 వరకు వడ్డీ చొప్పున కుదువ పెట్టిన వ్యాపారాస్తులకు నెల సరి చెలిస్తు, భాదిత కార్ల యజమానులకు వారికి రావలసిన నగదును కూడా ఆ ప్రధాన నిందిత సూత్రధారుడే తన ఫోన్ పే ద్వారా బాధిత కార్ల యజమానులకు చెల్లిస్తు రావడం,తమకు నెల, నెలకు సంబంధించిన లీజుఅగ్రిమెంట్ ప్రకారం అమౌంట్ చేరుతున్నదని భావించారు ఇక ప్రైవేటు సంస్థలకు నెలసరి వడ్డీలు కట్టడం ఇలా అనేక కార్ల మార్పిడి జరుగుతూ వస్తున్నది. ఒకపక్క కార్ల యజమానులు తమకు లీజు అగ్రిమెంట్ ప్రకారం నెలనెలా తమకు నగదు వస్తున్నదని, తమ కారు కూడా భద్రంగా రోడ్డు పనులకు వినియోగించుకుంటున్నారని ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు. కానీ ఆ ప్రధాన నిందిత సూత్రధారుడు మాత్రం కుదవ వ్యాపారంలో పెట్టి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నదన్న విషయం గ్రహించలేక పోయారు.ఇందులో ఒక ముఠామే ఏర్పడి ఈ భారీ స్కాంకు పసిగట్టిందన్న అనుమానం వ్యక్తం ఆయుతుంది.అయితే ఇచ్చినటువంటి కార్లకు ఎటువంటి రికార్డు లేకపోవడం కూడా ఒక కొనమెరుపుగా ఉంది. చివరకు పీలేరు, కలికిరి, తిరుపతి పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది బడాబడా నాయకులు తమకారులను ఆ ప్రధాన సూత్రధారి కి అప్పగించడంతో బాధిత కారు డ్రైవర్ తన కారును తెచ్చుకున్న సమాచారాన్ని తెలుసుకోవడంతో కలకడ, కలికిరి, గుర్రంకొండ పోలీస్ స్టేషన్లను ఆశ్రయించి తమ వాహనాలను తమకు అప్పగించాలని ఆయ స్టేషన్లలో కలిశారు. అందులో కొన్ని కార్లు వచ్చాయి.మిగతా కార్లు రాకపోవడంతో బాధిత కార్ల యజమానులు ఖంగుతిన్నారు. ఇందులో మరో విశేషం ఏమంటే ఈ కార్లు సోమల, గుర్రంకొండ తాడిపత్రి,పులివెందుల, చక్రాయిపేట వివిధ ప్రాంతాలలో ఆ ప్రధాన నిందిత సూత్రధారుడు కొదవ పెట్టడం గమనర్హం. ఇది ఏమైనా పోలీసులు ఈ కార్ల భారీ స్కాంను చెధిస్తే గగ్గురుపరిచే వాస్తవ సంఘటనలు బయటపడటమే కాకుండా భాదిత కార్ల యజమానులుకు సత్వర న్యాయం చేకూర్చే వారైతారు. మరి ఈ కార్ల స్కాం వెనుక ఎవరి హస్తం ఉందో,బాధితులకు తమ,తమ వాహనాలు దక్కుతాయో వేచి చుద్దాం.

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం:ఎమ్మెల్యే మేడా, జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట మండలం మిట్టమీద పల్లి గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ అకేపాటి అమర్నాథ్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి సచివాలయ వ్యవస్థ, వాలంటరీ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో ఉన్న అనారోగ్య వ్యక్తులను గుర్తించే విధంగా జల్లెడ పట్టి వారికున్న ఆరోగ్య సమస్యలను తెలుసుకునే మార్గాన్ని ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిఅని అన్నారు. ప్రతిపక్షాలు సీఎం పై దుష్ప్రచారం చేస్తున్నారని,ఎంత ఖర్చైనా పర్వాలేదని లక్షల మంది వైద్య సిబ్బందితో ఇంటింటికి వెళ్లి అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించేందుకు వాలంటీర్ల ద్వారా, సిబ్బంది ద్వారా మంచి కార్యక్రమాన్ని అందుబాటులో తెచ్చి ప్రజలు బాగుంటే గ్రామాలు బాగుంటాయని, గ్రామాలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని ఉద్దేశంతో ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ కౌంటర్,స్పాట్ కౌంటర్,రెఫరల్ కౌంటర్, ఓపి గదుల వద్ద వైద్యులు పరీక్షించే కౌంటర్లు,ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్,ఐ చెకప్ కౌంటర్లను,పౌష్టికహర అవగాహన కోసం

ఐసీడిఎస్ డిపార్ట్మెంట్ వారు ఏర్పాటు చేసిన స్టాల్ కౌంటర్ లను సందర్శించడం జరిగింది. ఐదు మంది వైద్యుల సమక్షంలో జరుగుతున్న సురక్ష కార్యక్రమంలో వైద్యం కోరకు వచ్చిన రోగులతో వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసు కోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో చొప్ప యల్లారెడ్డి, రాజంపేట వైఎస్ఆర్సిపి మండలాధ్యక్షులు రామ్మోహన్ నాయుడు, రాజంపేట మండలం జేసిఎస్ కన్వీనర్ మందరం గంగిరెడ్డి, రాజంపేట గవర్నమెంట్ హాస్పిటల్ డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి, సత్యాల రామకృష్ణ, సౌమ్యనాథ స్వామి దేవాలయం మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి , డీసీఎంఎస్ చైర్మన్ దండు గోపి,రాజంపేట జడ్పిటిసి దాసరి పెంచలయ్య, పోలి మురళి మోహన్ రెడ్డి, పాపినేని విశ్వనాథ రెడ్డి, శంకర్, ముక్క విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు కేటాయించిన లక్ష్యాలు సాధించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లాలో అధికారులకు కేటాయించిన లక్ష్యాలు 100% సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ గిరీష పిఎస్ హెచ్ ఓడిలకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ వివిధ శాఖల హెచ్వోడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ జరిగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో నోట్స్ తయారు చేసి విసికి హాజరు కావాలన్నారు. జిల్లాలోని హెచ్వోడీలు తమకు కేటాయించిన లక్ష్యాలు సాధించడంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రక్తహీనత లోపం ఉన్న గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి సరైన పోషకాహారం అందించి రక్తహీనత నివారణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు అనీమియా బారిన పడకుండా ఉండేందుకు, క్రమం తప్పకుండా వారికి పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పెండింగ్ లేకుండా పక్కాగా పరిశీలన చేసి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. పెండింగ్ అప్లికేషన్లు ఒక్కటి

కూడా ఉండదానికి వీలులేదన్నారు.జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఆరోగ్య వివరాలను సేకరించడం జరిగిందని జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు శిబిరంలో వారికి అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు, ఇచ్చే బృహత్తర కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజలందరు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకునేటట్లు చూడాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇచ్చిన లక్ష్యాలు 100% పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, ఐసిడిఎస్ పిడి ధనలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేస్తాం ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం

తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు

విశాలాంధ్ర -మదనపల్లి: చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తామని తెలుగుదేశం పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం మదనపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యపాన్నిషేధం తీసుకొస్తామని చెప్పి గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం ధరలను పెంచి ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. దీనిపైన వ్యతిరేకత రాకుండా ప్రజలకు సంక్షేమ పేరుతో బటన్ నొక్కుతున్నారని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు అనుకుంటున్న తరంలో దీని అడ్డుకోవడానికి ప్రజల నుండి చంద్రబాబు దూరం చేయడానికి అక్రమ కేసులు ఆరోపించారు. ఇంతవరకు అధికారులు చంద్రబాబు అవినీతి చేశారని ఒక్క రూపాయి కూడా నిరూపించుకోలేకపోయాయని అన్నారు. వైసిపి తిరిగే అధికారంలోకి రావడానికి దొంగ ఓట్ల ఎక్కించుకోవడం డబ్బులు పంచడం ఇలాంటి కార్యక్రమాలతో తిరిగి అధికారంలోకి రావాలని వైసీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సాజన్ భాష మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పాలనలో 10 లక్షల కోట్ల అప్పు చేశారని అన్నారు దీ అందరు సహకారంతో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసి మదనపల్లి తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్ మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎస్ఎ మస్తాన్ బాలు స్వామి పటాన్ ఖాదర్ ఖాన్ రాటకొండ మధుబాబు జీకే వెంకటరమణ వెంకట శివప్రసాద్ శ్రీహరి దొరస్వామి నాయుడు షంషీర్ భాష నాగూర్ వరుణ్ ఇతర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

సిద్ధాంతాల పార్టీ జనసేన పార్టీ

రాయలసీమకు కన్వీనర్ రాందాస్ చౌదరి

విశాలాంధ్ర-మదనపల్లి: మదనపల్లి కమ్మవీధి లో జనసేన పార్టీ కార్యలయం లో జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి గారి ఆధ్వర్యంలో జనసేన నాయకులు కార్యకర్తలు, వీరమహిళలతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాందాస్ చౌదరి మాట్లాడుతూ మొన్నటి వరకు జనసేన పార్టీ లో ఉన్న కేతంరెడ్డి ఈ రోజు వైసీపీ ఖండువ కప్పుకొని వైసీపీ పార్టీ లో చేరి చేరకనే జనసేన పార్టీ క్రియా శీలక సభ్యత్వాల రుసుము పై విమర్శలు చేయడం అసలు నీది మానవ జన్మ ఏనా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ అధినేత మా పవన్ కళ్యాణని, చైర్మన్ నాదెండ్ల మనోహర్ని,మా పార్టీ సిద్ధాంతలను విమర్శించడం మదనపల్లి జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది అని అన్నారు. రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుని గా ఎన్నిక అయిన జగన్మోహన్ రాజు గారిని అభినందిస్తూ రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారు ఆదేశామిచ్చారో వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్, వైసీపీ విముక్త మదనపల్లి ధ్యేయంగా జనసేన,టీడీపీ శ్రేణులు కలసి కట్టుగా పనిచేస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్, రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, రెడ్డెమ్మ,చంద్రశేఖర,కుమార్, నవాజ్,జనార్దన్,జంగాల గౌతమ్, జయ, గండికోట లోకేష్, నారాయణ స్వామి, లవన్న, ప్రసాద్, అర్జున, శంకర, విజయ్ కుమార్, గంగులప్ప నరేంద్ర, నరేష్, తేజ తదితరులు పాల్గొన్నారు

ఆదిత్య కళాశాలలో మొక్రేటా పై అవగాహన

విశాలాంధ్ర -మదనపల్లి : పుంగనూరు రోడ్డు నందుగల ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో డ్రైవ్ నిర్వహించారు. బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు వారు డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్ లో ఏడు మంది ఆదిత్య ఇంజనీరింగ్ కళ శాల విద్యార్థులు ఎంపికయ్యారు వీరికి సంవత్సరానికి మూడు లక్షల రూపాయల ప్యాకేజీ ఇవ్వబడుతుంది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామలింగారెడ్డి గారు వీరిని అభినందిస్తూ భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే సతీష్ బాబు గారు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. వి. వరప్రసాద్ హెడ్ ఆఫ్ ఈసీఈ డిపార్ట్మెంట్, ఎల్ వేణుగోపాల్ రెడ్డి, హెడ్ ఆఫ్ ఈ ఈ ఈ మరియు టి. పి. ఓ మనోజ్ కుమార్, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ పి. లోకేష్ ముని కుమార్ మరియు ఇతర విభాగాతిపతులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్ఐ

విశాలాంధ్ర -రామాపురం : ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్సై కొండారెడ్డి తెలిపారు బుధవారం పోలీస్ స్టేషన్ ఎదురుగా ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ లేని వారందరికీ అవగాహన కల్పించారు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరగవని ప్రాణాపాయం నుంచి బయటపడచ్చని అన్నారు హెల్మెట్ లేని సమయంలో ప్రమాదాలు జరిగితే ప్రాణ నష్టం తప్పదు అన్నారు తప్పకుండా ప్రతి ఒక్కరు హెల్మెట్ ను ధరించాలన్నారు గతంలో హెల్మెట్ లేకుండా ప్రమాదాల బారిన పడిన ఫోటోలను చూపించిఈ పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారుప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఇంటికి వెళ్లాలని ఇంటిదగ్గర మీ పెద్దవారు భార్య పిల్లలు ఎదురు చూస్తూ ఉంటారని ఆయన తెలిపారు.

ధనలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ కనకదుర్గమ్మ దేవి

విశాలాంధ్ర -రాజంపేట : దసరా ఉత్సవాలలో భాగంగా రాజంపేట మండల పరిధిలోని వెంకట రాజంపేట గ్రామంలో వెలిసిన శ్రీ కనకదుర్గ మహేశ్వరి ఆలయంలో నాలుగవ రోజు బుధవారం మహాలక్ష్మి, ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవార్లకు ఆలయ అర్చకులు గణపతి హెూమం శ్రీ వాసవి మూలమంత్ర నిత్య హెూమం, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున భక్తిశ్రద్దలతో పాల్గొని అమ్మవారి చుట్టూ ప్రదర్శనలు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

మంత్రి,ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన హబీబ్

విశాలాంధ్ర-పీలేరు:- రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట పార్లమెంట్ సభ్యులు యువ ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి, ఏపీ డీసీఎం డైరెక్టర్ హరీష్ రెడ్డిలను పీలేరు మాజీ సర్పంచ్ యువ కెరటం హబీబ్ భాషా సదుంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వారితో పీలేరు అభివృద్ధి, పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని హబీబ్ బాషా పేర్కొన్నారు. ఇందుకు మంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించి పీలేరు అభివృద్ధితో పాటు,పలు సమస్యల కొరకు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు

బాధితునికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర- బి. కొత్తకోట: మండలంలోని నాయనా బావి పంచాయతీ రెడ్డివారి పల్లి చెందిన చిటిక చిన్నపరెడ్డి కి ఈ మధ్యకాలంలో కాలుకి గాయమై కాలు తొలగించడంతో అనాధగా ఉన్న ఆయన్ను గమనించి ఆ గ్రామస్తులు ప్రముఖ పారిశ్రామికవేత్త మొరుసు కాపు సంఘ నాయకుడు జచంద్ర రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి బుధవారం రెడ్డివారి పల్లికి వచ్చి ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పి వైద్య ఖర్చులు గాను 25 వేల రూపాయల్లో అందించారు అలాగే అదే గ్రామంలో విద్యుత్ షాక్ కు విద్యార్థి మరణించగా తండ్రి రెడ్డప్పరెడ్డిని పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సాయం గా అందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు జయరాం రెడ్డి నాగిరెడ్డిఎంపీటీసీరామసుబ్బారెడ్డి మొరుసు కాపు నాయకులు దాదంలోకి నాథ్ రెడ్డి ఆంజనేయ రెడ్డి సుబ్బారెడ్డి తరిగోడు దు బాబు పాల్గొన్నారు.

సుండుపల్లికి చేరిన యర్రపురెడ్డి అజయ్ రెడ్డి

ఘనంగా స్వాగతం పలికిన నాయకులు,అభిమానులు

విశాలాంధ్ర -సుండుపల్లె: మండలం సీనియర్ నాయకులు యర్రపురెడ్డి అజయ్ రెడ్డి బుధవారం హైదరాబాదు నుండి సుండుపల్లెకు చేరుకున్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు,కార్యకర్తలు అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.అలాగే బుధవారం సాయంత్రం సుండుపల్లె గ్రామం రెడ్డివారిపల్లెలో గల ఆయన స్వగృహంలో మండల నాయకులు చమర్తి గంగరాజు, రెడ్డయ్యరాజు తదితరులు యర్రపురెడ్డి అజయ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం ఇటీవల కాలంలో సుండుపల్లె మండలంలో చోటు చేసుకున్న రాజకీయ స్థితిగతులపై వారిరువురూ చర్చించున్నారు.ఈ కార్యక్రమంలో చమర్తి గంగరాజు,రెడ్డయ్య రాజు లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, యర్రపురెడ్డి కుటుంబం అభిమానులు పాల్గొన్నారు.